క్లుప్తంగా

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు


సూచనలిస్తున్న డీఎస్పీ సయ్యద్ మహ్మద్

వెదురుకుప్పం : ట్రాఫిక్ సమస్యను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నగరి డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్ అన్నారు. బుధవారం మండలంలోని పచ్చికాపల్లంలో వ్యాపారులతో ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పచ్చికాపల్లంలో నిత్యం ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోందని, వ్యాపారులు సహకరించాలని కోరారు. ఈ మేరకు పోలీసులు దుకాణాల వద్దకు వెళ్లి సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య, కార్యదర్శి సాయిభవాణి పాల్గొన్నారు.

ముగిసిన మాతమ్మ ఉత్సవాలు


అలంకరణలో అమ్మవారు

పాలసముద్రం : మండలంలోని శ్రీబొమ్మరాజుపురం ఆది ఆంధ్రవాడలో మాతమ్మ తిరునాళ్లు వైభవంగా ముగిశాయి. ఉదయం 10 గంటలకు పాలు, పసుపునీటి బిందెలతో గ్రామాల్లో ఊరేగించి అమ్మవారిని అభిషేకించారు. మధ్యాహ్నం మహిళలు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అమ్మవారిని సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేసి గ్రామస్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం అమ్మవారిని పుష్పపల్లకిలో అలంకరించి ఊరేగింపు నిర్వహించారు.

వేడుకగా అర్జున తపస్మాన్


తపస్సు మానును అధిరోహిస్తున్న అర్జున వేషధారి

పాలసముద్రం : మండలంలోని క్రిష్ణజమ్మపురం గ్రామంలో మహా భారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అర్జున తపస్మాన్ కార్యక్రమం వేడుకగా సాగింది. శ్రీ వెంకటేశ్వరా కళామండలి అర్జున వేషధారి తపస్మాన్ చెట్టులోని ప్రతి మెట్టు..మెట్టుకూ పరమశివుడిని వేడుకుంటూ పద్యాలు ఆలపిస్తు తపస్సు మానును అధిరోహించారు. సంతానం లేని మహిళలు తపస్సు మాను వద్ద వరపడి సంతానం కలగాలని వేడుకున్నారు. అర్జునుడు తపస్సు మాను మీద నుంచి పూలు, నిమ్మకాయలు, వీబూదిపండ్లు విసరడంతో వాటి కోసం భక్తులు ఎగబడటంతో తొక్కిసలాట చోటు చేసుకుంది. తమిళనాడు, కర్ణాటక నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావడంతో ద్రౌపదీ ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది.

ముగిసిన బాట గంగమ్మ మహోత్సవాలు


అంబలి, పొంగళ్లతో మహిళలు

పాలసముద్రం : మండలంలోని శ్రీకావేరిరాజుపురం పంచాయతీ ఏటూకూరిపల్లె గ్రామంలో వెలసిన బాటగంగమ్మ కొలువు మహోత్సవం బుధవారం ముగిసింది. ఉదయం గ్రామంలోని మహిళలు అమ్మవారికి పొంగళ్లు, అంబలి సమర్పించారు. మధ్యాహ్నం పాల బిందెలతో ఊరేగించి అమ్మవారికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం అమ్మవారిని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

వీరబ్రహ్మేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు


రథంపై ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు

పుత్తూరు: స్థానిక నగరం రోడ్డులో వెలిసి ఉండు శ్రీ వీరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి పురాతన ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి జీవసమాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక అభిషేకాలు చేశారు. సాయంత్రం శ్రీగోవిందమాంబ సమేత శ్రీవీరబ్రహ్మేంద్రస్వామిని విశేషంగా అలంకరించి రథంపై పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త కరుణాకరశెట్టి, నిర్వాహకులు ఈశ్వరాచారి, మాధవాచారి, గురు, రవి, సుబ్రమణ్యం, మనోహర్, వాసు, రవి, కేశవాచారి, మురళి పర్యవేక్షించారు.

జాడలేని రాయితీ రుణాలు



రాష్ట్ర ప్రభుత్వం ఏది ప్రకటించినా.. ప్రచార ఆర్భాటాలే తప్ప ఆచరణలో మాత్రమే శూన్యం. సూపర్ సిక్స్‌ను అటకెక్కించిన ప్రభుత్వం తాజాగా ప్రకటించిన బీసీ, ఓసీల స్వయం ఉపాధి రాయితీ రుణాలను సైతం మరిచిపోయింది. నెలలు గడిచిపోతున్నా నేటికీ అర్హుల ఖాతాల్లో జమ కాలేదు. ఇందుకు స్థానికంగా ఉన్న అధికారపార్టీ నాయకుల సిఫార్సులే ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఆశ చూపి అటకెక్కిస్తారా అంటూ నిరుద్యోగ యువతీ యువకులు, వెనకబడిన తరగతుల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- ఇంటర్వ్యూలు చేసి 3 నెలలు కావస్తున్నా అందని రుణాలు
- రాజకీయ జోక్యమే కారణమంటూ ఆరోపణలు
- ఆందోళనలో దరఖాస్తుదారులు


ఇంటర్వ్యూ కోసం వేచివున్న దరఖాస్తుదారులు (ఫైల్)

పుత్తూరు: వెనకబడిన తరగతుల వారితో పాటు అన్ని కేటగిరీల నిరుద్యోగ యువతీ యువకుల స్వయం ఉపాధి కల్పన కోసం అంటూ ప్రభుత్వం రాయితీ రుణాల మంజూరుకు ఆదేశాలు జారీ చేసింది. ఇందుకోసం ఒక్కో మండలం నుంచి 60 నుంచి 90 యూనిట్ల వరకు అనుమతినిచ్చింది. ఒక్కో యూనిట్‌కు రూ.2 లక్షలు మంజూరు చేస్తుండగా బీసీలతో పాటు ఓసీలకు సైతం రూ.75 వేలు సబ్సిడీ ఇవ్వనుండగా, రూ.1.25 లక్షల రుణం, కాపు కార్పొరేషన్ ద్వారా కాపులకు రూ.1 లక్ష సబ్సిడీ, రూ.1 లక్ష రుణం అందించే విధంగా మార్గదర్శకాలు రూపొందించారు. అర్హులైన వారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలంటూ ఆయా మండల, మున్సిపల్ అధికారులు ప్రకటనలు విడుదల చేశారు. దీంతో రాయితీ రుణాలపై ఎంతో ఆశతో ఒక్కో లబ్ధిదారుడు రూ.400 ఖర్చు పెట్టి దరఖాస్తు చేసుకున్నారు. ఒక్క పుత్తూరు మున్సిపాలిటీలో బీసీ కేటగిరీ నుంచి 637 మంది, ఓసీ కేటగిరీ నుంచి 90 మందితో కలిపి మొత్తం 727 మంది దరఖాస్తు చేసుకున్నారు. పుత్తూరు రూరల్ మండలం నుంచి మరో 149 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇంత మంది దరఖాస్తు చేసుకున్నా పుత్తూరు మున్సిపాలిటీ నుంచి కేవలం 60 మంది, రూరల్ మండలం నుంచి 54 మందికి మాత్రమే రాయితీ రుణాలు పొందేందుకు అవకాశం ఉంది. ఇందుకోసం ఫిబ్రవరి 21వ తేదీన మున్సిపల్ కార్యాలయంలో స్థానికంగా ఉన్న యూనియన్ బ్యాంకు, ఎస్‌బీఐ-1, 2, సప్తగిరి గ్రామీణ బ్యాంకు, బ్యాంకు ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంకు సిబ్బంది ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలకు తరలివచ్చిన దరఖాస్తుదారులు, వారి సహాయకులతో కార్యాలయం వద్ద తోపులాటలకు సైతం దారితీసింది. ఇంతగా పోరాడి ఇంటర్వ్యూలు పూర్తి చేస్తే, నెలలు గడిచిపోతున్నా వాటి ఊసే లేకపోవడంతో లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రాజకీయ జోక్యమే కారణం

ఈ రాయితీ రుణాల సంఖ్య పరిమితంగా ఉండడంతో పాటు రాజకీయ రంగు పులుముకోవడంతో రుణాల పంపిణీకి ఆలస్యమవుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి మండలంలో వేల సంఖ్యలో లబ్ధిదారులు ఉండగా కేవలం పదుల సంఖ్యలో మంజూరుకు అనుమతులంటూ ఆదేశాలు ఇవ్వడంతోనే ప్రభుత్వ నిర్ణయంపై పలు విమర్శలు తలెత్తాయి. ఇందుకు తోడు ఉన్న కొద్దిపాటి రుణాలను సైతం తమ కార్యకర్తలకు ఇవ్వాలంటూ స్థానికంగా ఉన్న టీడీపీ నాయకులు పైరవీలు చేస్తుండడంతో మొదటికే మోసం వచ్చే విధంగా పరిస్థితి తయారైంది. దీంతో రాయితీ రుణాలైనా వస్తే చిన్నపాటి వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగించాలని ఆశించిన వారు నిరాశ చెందుతున్నారు. పేదలకిచ్చే సబ్సిడీ రుణాల్లో రాజకీయ జోక్యాన్ని అరికట్టి అర్హులైన ప్రతి ఒక్కరికీ రుణాలివ్వాలని ఆశావహులు అభ్యర్థిస్తున్నారు.

మరో 10 రోజుల్లో..

ఇంటర్వ్యూల తర్వాత దరఖాస్తుదారుల జాబితా సంబంధిత బ్యాంకులకు పంపించినట్లు తెలిపారు. బ్యాంకుల వారు సివిల్ స్కోర్ (లబ్ధిదారుడి వ్యక్తిగత రుణాలు, తిరిగి చెల్లింపులు) వివరాల సేకరణ పనిలో ఉన్నారు. మరో 10 రోజుల్లో రుణాలు మంజూరయ్యే అవకాశం ఉంటుందని భావిస్తున్నాం.



- ఎం.మంజునాథ గౌడ్, మున్సిపల్ కమిషనర్, పుత్తూరు

చిన్నారికి రోజా ఆశీస్సులు


కావ్యను ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి రోజా

పుత్తూరు: పట్టణంలోని ఈశ్వరి కల్యాణ మండపంలో బుధవారం రాత్రి పుత్తూరు మండల వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, సరిత దంపతుల కుమార్తె కావ్య హాఫ్ శారీ వేడుక నిర్వహించారు. దీనికి హాజరైన మాజీ మంత్రి ఆర్కే రోజా కావ్యను ఆశీర్వదించారు. ఆమె వెంట పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

ఆరోగ్య కేంద్రానికి బెడ్‌షీట్స్ వితరణ

శ్రీరంగరాజపురం : మండలంలోని ఆరిమాకులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గంగాధర నెల్లూరు రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ గౌరికి బెడ్‌షీట్లను అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ గౌరి మాట్లాడుతూ.. ఆరోగ్య కేంద్రానికి రోగుల సౌకర్యార్థం బెడ్‌షీట్లు అందించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ రెడ్‌క్రాస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, సభ్యులు జమీర్, సాజిత్‌బేగం, ప్రసాద్‌రెడ్డి, పాపిరెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్‌పై అవగాహన

గంగాధర నెల్లూరు : ఆయిల్‌పామ్ పంటపై రైతులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఉద్యాన అధికారి లోకేష్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 9 గంటలకు సమావేశం ఉంటుందన్నారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

పెనుమూరు(కార్వేటినగరం) : మండలంలో మంగళవారం రాత్రి వీచిన గాలి బీభత్సానికి పలు గ్రామాల్లో విద్యుత్ తీగలు తెగిపడి విద్యుత్‌కు అంతరాయం కలిగింది. స్పందించిన విద్యుత్ ఏఈ తులసీ ప్రసాద్ బుధవారం తెగిపడిన విద్యుత్ తీగలను మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

డైట్ లెక్చరర్‌గా సురేష్‌బాబు



కుప్పం: మండలంలోని పెద్దగోపనపల్లె ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్రం ఉపాధ్యాయుడు టి.సురేష్ బాబు ఉపాధ్యాయ శిక్షణా కేంద్రం (డైట్)లో సైకాలజీ బోధించేందుకు ఫారిన్ సర్వీసు కింద ఎంపికయ్యారు. ఇటీవల ట్యాబ్ బేస్డ్ పరీక్ష, ఇంటర్వ్యూలో ప్రతిభ కనబరచి ఆయన ఎంపికయ్యారు. పలువురు టీచర్లు ఆయన్ను అభినందించారు.

రేపు వాహనాల వేలం

పుత్తూరు: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో శుక్రవారం ఉదయం వాహనాల వేలం పాట నిర్వహించనున్నట్లు సీఐ బి.మురళీమోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్టేషన్ పరిధిలో జరిపిన దాడుల్లో స్వాధీనం చేసుకున్న వివిధ వాహనాలను వేలం వేస్తున్నట్లు తెలిపారు. జీఎస్టీ రిజిస్ట్రేషన్ కలిగిన వారు నిర్దేశించిన ధరావత్తు చెల్లించి వేలం పాటల్లో పాల్గొనాలని వెల్లడించారు.

ఆయిల్‌పామ్ సాగు చేయండి


మాట్లాడుతున్న జిల్లా ఉద్యానవన శాఖ అధికారి

నింద్ర: రైతులు ఆయిల్‌పామ్ తోటలు సాగు చేసి అధిక దిగుబడులు పొందాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మధుసూదనరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన రైతుల అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పామ్ తోటలు అన్ని రకాల నేలల్లో సాగు చేయవచ్చని చెప్పారు. అందుకోసం రైతులకు మొక్కలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అంతర పంటలు వేసుకునే విధంగా రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పీడీ బాలసుబ్రమణ్యం, ఎంపీడీఓ శివప్రసాద్‌వర్మ, ఎంపీపీ దీప, సర్పంచ్ బాబురెడ్డి తోపాటు వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

రథాన్ని అధిరోహించిన ఆదిదంపతులు


రథంపై ఊరేగుతున్న శివపార్వతులు

పుత్తూరు: శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శివపార్వతులు రథాన్ని అధిరోహించి భక్తులను కటాక్షించారు. ఉదయం ప్రత్యేక అభిషేకాలు చేశారు. రాత్రి 8 గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను సుందరంగా అలంకరించి రథంపై ఆశీనులను చేశారు. మహిళల కోలాట నృత్యాలు, వాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగారు. దీనికి శ్రీకృష్ణదేవరాయల బలిజ సేవా సంఘం ఉభయదారులుగా వ్యవహరించారు.

వైభవంగా గంగమ్మ జాతర


గంగమ్మను దర్శించుకుంటున్న మాజీ మంత్రి ఆర్కేరోజా

నగరి : మండలంలోని మాంగాడు గ్రామంలో బుధవారం గంగ జాతర వైభవంగా నిర్వహించారు. వేకువజామున గంగమ్మను ఊరేగింపుగా తెచ్చి వేపాకు గుడిసెకు చేర్చారు. మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారికి చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వేపాకు సారెలు, వెయ్యికన్నుల దుత్తల్లో దీపాలు సమర్పించారు. తడిదుస్తులతో అంగప్రదక్షిణం చేశారు. కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు గంగమ్మ నైవేద్యం సమర్పించి కర్పూర హారతులు స్వీకరించారు. సాయంత్రం మాజీ మంత్రి ఆర్కేరోజా జాతర వేడుకల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. జాతర నిర్వాహకులు ఆమెకు స్వాగతం పలికి అమ్మవారి ప్రసాదాలు అందజేశారు. ఆమె వెంట మండల పార్టీ అధ్యక్షులు తిరుమలరెడ్డి, వైస్ ఎంపీపీలు కన్నియప్ప, డిల్లి, స్థానిక నాయకులు జగదీష్‌రెడ్డి, రవికుమార్, హరి తదితరులు పాల్గొన్నారు. రాత్రి బలిఅన్నం సమర్పించి గంగమ్మను డప్పువాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్ళి పొలిమేర దాటించారు.


అల్లూరిని ఆదర్శంగా తీసుకోవాలి


నివాళులర్పిస్తున్న క్షత్రియ సంఘ నాయకులు

పుత్తూరు: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాట పటిమ, దేశభక్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు సురేష్‌రాజు పిలుపునిచ్చారు. అల్లూరి 101వ వర్ధంతి సందర్భంగా బుధవారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సురేష్‌రాజు మాట్లాడుతూ తెలుగు జాతి గర్వించదగ్గ స్వాతంత్య్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. అల్లూరి జీవించింది కేవలం 27 ఏళ్లే అయినా ఆయన కీర్తి చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. అనంతరం క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అఖిల భారత క్షత్రియ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్‌రాజు, డాక్టర్ రవిరాజు, రామ్మోహన్‌వర్మ, లక్ష్మణరాజు, చంద్రబాబు, రమేష్‌రాజు, ప్రసాద్‌రాజు పాల్గొన్నారు.

కలుషిత నీటితో ఆందోళన


రెడ్డేపల్లిలోని నీటి ట్యాంకు


పై కప్పు లేకుండా పాచి పట్టిన లోపల నీరు

గంగాధర నెల్లూరు : కూటమి నేతల ఆగడాలు మండలంలో రోజు రోజుకు శ్రుతిమించుతున్నాయి. మండల కేంద్రంలోని జీడీ నెల్లూరు పంచాయతీ రెడ్డేపల్లి గ్రామంలో వాటర్ ట్యాంకులో పారిశుద్ధ్య పనులు చేయొద్దు అంటూ స్థానిక కూటమి నేత హుకుం జారీ చేశారు. దీంతో ఆరు నెలలుగా పాచి పట్టిన నీళ్లు తాగలేకపోతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తుల వివరాల మేరకు ట్యాంకు ఉన్న స్థలం తమది అంటూ ఆ స్థలంలో ఎలాంటి పనులు చేయొద్దని ఆ నేత భీష్మించారు. ట్యాంకు పారిశుద్ధ్య పనులు చేస్తామంటున్న సర్పంచిని అడ్డుకోవడంపై సర్వత్రా విమర్శలు నెలకొన్నాయి.

వైభవంగా గంగజాతర




కార్వేటినగరం: అలంకరణలో అమ్మవారు, వెదురుకుప్పం: కోలాటం వేస్తున్న భక్తులు

వెదురుకుప్పం: మండలంలోని టీకేఎంపురం (తిరుమల కొండ మాంబా పురం)లో గంగజాతర మహోత్సవం వైభవంగా నిర్వహించారు. బుధవారం అమ్మవారి ఊరేగింపును మహిళలు భక్తిశ్రద్ధలతో కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలో 34 ఏళ్ల తరువాత జరిగిన గంగ జాతరను కనులపండువగా నిర్వహించారు. కోలాటం ఆకట్టుకుంది. ఎస్‌ఐ వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

వైభవంగా ముగిసిన గంగమ్మజాతర

కార్వేటినగరం : మండల పరిధిలోని ఆర్కేవీబీపేటలో మంగళవారం నుంచి జరుగుతున్న నడివీధి గంగమ్మ జాతర బుధవారం ఘనంగా ముగిసింది. అమ్మవారిని అలంకరించి ప్రత్యేక వాహనంపై ప్రతిష్ఠించి ఊరేగించారు. ఉదయం అమ్మవారిని నడివీధిల్లో కొలువు దీర్చి కుంభం సమర్పించారు.

నేటితరానికి మార్గదర్శి రామకృష్ణారెడ్డి


నివాళులర్పిస్తున్న ప్రముఖులు

వెదురుకుప్పం: జీవితంలో ఎన్నో ఒడుదొడుకులను ఎదుర్కొని, కష్టాలను జయించి, ముందుకు నడిచిన వ్యక్తి పద్మశ్రీ అవార్డు గ్రహీత ఆచార్య బండి రామకృష్ణారెడ్డి నేటి తరానికి మార్గదర్శకమని ద్రవిడ విశ్వవిద్యాలయం ఉపకులపతి దొరస్వామి కొనియాడారు. మండలంలోని మొండివెంగనపల్లెలో బుధవారం ఏర్పాటు చేసిన రామకృష్ణారెడ్డి సంస్మరణ సభలో ద్రవిడ వర్సిటీ వీసీ ముఖ్యఅతిథిగా పాల్గొని, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పం ద్రవిడ విశ్వవిద్యాలయానికి ఆయన వ్యవస్థాపక కుల సచివులుగా చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ప్రధాన ద్రవిడ భాషలైన తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం భాషలకు సమ ప్రాధాన్యం ఇచ్చి అందుకు అనుగుణంగా శాఖలను ఏర్పాటులో ఆయన కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. అనంతరం పలువురు వక్తలు ఆయన కృషిని కొనియాడారు.

రైతన్నల ఎదురుచూపులు

- మండలానికి చేరని విత్తనకాయలు
- రాయితీ విత్తనంపైనే ఆశలు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు


శ్రీకావేరిరాజుపురం సమీపంలో ట్రాక్టర్‌తో పొలాన్ని దున్నుతున్న రైతన్న

పాలసముద్రం : ఖరీఫ్ సీజన్ సమీపిస్తోంది. విత్తన కాయలు కోసం రైతులు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన రాయితీ విత్తన కాయలు ఇంకా మండలాలకు చేరలేదు. మరోవైపు నియోజకవర్గంలో కురిసిన వర్షాలకు పొలాలను దుక్కులు దున్ని సిద్ధం చేసుకుంటున్నారు. ఏటా ప్రభుత్వం ఇచ్చే విత్తన కాయలు ఆలస్యం అవుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో ఆరు మండలాల్లో 17,330 హెక్టార్లలో వేరుశనగ సాగు చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో వర్షాధారంపై ప్రధానంగా సాగు చేస్తారు. గత అయిదేళ్లుగా తీవ్ర వర్షాభావంతో వేరుశనగ పంట ఆశించిన దిగుబడులు రాలేదు. పంట పెట్టుబడులు సైతం దక్కక రైతులు అప్పులు పాలయ్యారు. ఏ ఒక్క రైతు వద్ద కూడా విత్తన వేరుశనగ కాయలు లేవు. దీంతో సబ్సిడీ వేరుశనగ కాయల కోసం ఎదురుచూస్తున్నారు. మే మొదటి వారానికే సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలు మండలాలకు చేరేవి. ప్రస్తుతం కాయలు ఎప్పుడు వస్తాయనే విషయం అధికారులకే స్పష్టంగా తెలియడం లేదు. ఇటీవల కురిసిన వర్షానికి రైతులు పంటసాగు కోసం దుక్కులు దున్ని సాగుకు భూములను సిద్ధం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి త్వరగా వేరుశనగ విత్తన కాయలు మండలాలకు వచ్చేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

వేరుశనగ ఎండిపోయింది



రబీలో బోరు బావుల కింద రెండెకరాల్లో వేరుశనగ సాగు చేశా. బోరు బావుల్లో నీరు అడుగంటిపోవడంతో పంట చేతికందే సమయంలో నీరులేక ఎండిపోయింది. పెట్టుబడులు కూడా దక్కలేదు. ఖరీఫ్‌లో కాస్తో కూస్తో వర్షం కురిసింది. పంట సాగు చేయాలంటే విత్తన కాయలకు ఇబ్బందిగా ఉంది.

- రవిరెడ్డి, కేజే పురం రైతు

రాయితీ విత్తన కాయలు ఇవ్వాలి



అప్పులు చేసి కష్టపడి పంట సాగు చేసి వరుసగా నష్టపోయాం. ఈసారి సాగు చేసే స్తోమత లేదు. అయితే వర్షాలు పడి భూములను బీడుగా పెట్టాలంటే ఇబ్బందిగా ఉంది. ఈసారైన అప్పులు తీరిపోతాయని ఆశ ఉంది. ఎక్కువ సబ్సిడీతో ప్రభుత్వం విత్తనం ఇస్తేనే వేరుశనగ సాగుచేస్తాం.

- షణ్ముగరెడ్డి, కేజే పురం, రైతు

ప్రతిపాదనలు పంపించాం



రైతన్నలకు ఈ ఏడాది ఖరీఫ్‌లో అవసరమైన వేరుశనగ విత్తన కాయలు సకాలంలో అందించడానికి చర్యలు తీసుకుంటున్నాం. ఇందులో భాగంగా 550 క్వింటాళ్ల వేరుశనగ విత్తనం కోసం ప్రతిపాదనలు పంపాం. డిమాండ్ మేరకు విత్తన కాయలను అందిస్తాం. రైతులు ఖరీఫ్ వ్యవసాయానికి సిద్ధం కావాలి.

- డిల్లీ ప్రసాద్, వ్యవసాయాధికారి, పాలసముద్రం

ఆటో బోల్తా.. తప్పిన ప్రమాదం


కార్వేటినగరంలో బోల్తాపడిన ఆటో

కార్వేటినగరం : మండల కార్యాలయానికి కూతవేటు దూరంలో ఆటో బోల్తా పడిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా... పళ్లిపట్టు నుంచి పుత్తూరుకు ఎర్రగడ్డల లోడుతో వస్తున్న ఆటో చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిపై కార్వేటినగరం మండల కార్యాలయం సమీపంలో అదుపు తప్పి బోల్తా పడింది. ఆ సమయంలో ఎలాంటి వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం లేకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.